

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 7 సంచిక : 20 పుష్పం : 55-57 05-07-2002

**RAMANA BHASKARA**

**TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE**

PAGES : 20

**VOL : 7** **ISSUE : 20**

EDITOR
**P.S. RAMA RAJU**

EDITING
**P.H.V. SATYAVATHI**
(HYMA)

**SUBSCRIPTION**
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

**ADDRESS**
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
**JINNURU - 534 265**
W.G.Dt., A.P.

**PUBLISHER**
P.S. RAMARAJU
LAKSHMI MODERN RICE MILL
**ULLAMPARRU - PALAKOL**
☎ 08814 - 24589, 24689

**PRINTER**
SHRIRAM GRAPHICS
BANK STREET - **PALAKOL**
☎ 08814 - 22438, 24278


## పట్టుదలే పరమార్థాన్ని పట్టి యిస్తుంది

"కృషి" ఉంటే మనుషులు ఋషులౌతారు. ఇలవేల్పులౌతారు" అంటారు అది నిరంతర ప్రయత్న ప్రవాహం వల్లనే సాధ్యమౌతుంది. సాధారణ మానవుడు కృషికి వెంటనే ఫలితం చూడాలని, అనుకొంటాడు. పరమార్థంలో ఉన్న విలువ అర్థమౌతేనే ఆచరించాలనే బుద్ధి పుడుతుంది. జీవితంలో అనేక ఎదురుదెబ్బలు తగిలి ఈ ప్రకృతి పదార్థాలలో శాంతిలేదని గ్రహించిన బుద్ధే ఆధ్యాత్మిక ప్రాగణంలో అడుగుపెడుతుంది. కాని పాత వాసనలు నలువైపులా చుట్టుముట్టి నామాటఏమిటి? అని చిందులుతొక్కుతూ ఉంటాయి. సాధన సాగనియ్యదు. బావిలో పడ్డపశువైనా బయటకు రావటానికి కాళ్ళు ఆడిస్తుంది. బుద్ధిగల మానవుడే "మాయ" అనే ఊబినుంచి బయటపడలేకపోతున్నాడు. మనం లోపల నిండుగా ఉండాలి. బయటకి సామాన్యంగా కనిపించాలి. నేను-నాది అనే భావాలకు బదులు, నీవు-నీది అనే భావాలు

**ఈ సంచికలో......** **సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు**


06-03-2002 హైదరాబాదు .......... 3
23-06-2002 జిన్నూరు .......... 10
28-06-2002 సిద్ధాపురం .......... 16


Visit us @ www.srinannagaru.com



సుస్థిరం చేసుకోవాలి. మనలోని అహంకృతిని వెళ్ళగొట్టి మన ద్వారా భగవంతుణ్ణి పని చేయించాలి. సత్య ప్రచారం కంటే సత్యమే తానై జీవించాలి, దానికి గురుకృపను ఆసరాగా తీసుకొని సాధన చెయ్యాలి. సాధనలేనిదే సిద్ధిలేదు అంటారు. మనకు సత్యానుభూతి పొందాలనే కాంక్ష లేకపోతే ఆ వాసుదేవ స్వామి మాత్రం ఏమి చెయ్యగలడు? అనగా అనగా రాగమతిశయించు, తినగ తినగ వేము తియ్యగా ఉండు, సాధనమున పనులు సమకూరు ఇలలోన; అన్నారు వేమన. కూలిపని చేసిన వ్యక్తికీ యజమాని ఫలాన్ని యిస్తూ ఉంటే, పరమదయాళువు పరమాత్మ తన కోసం చేసే కృషికి ఫలితాన్ని ఎందుకు ఇయ్యడు? నిరాశ, సందేహం, నిరీక్షణ, దౌర్బల్యగుణాలు, ఆత్మ విశ్వాసం పెంచుకొంటే ఆత్మలభ్యమౌతుంది. దానికి ఈ కథ ఒక ఉదాహరణ : "ఒక పిచ్చుక సముద్రం ఒడ్డున పెట్టిన గుడ్డు సముద్రంలోకి దొర్లిపోయి అందుకలసిపోగా గుడ్డును పొందాలనే ప్రయత్నంలో తన రెక్కలతో ఆ సముద్రపు నీటిలో తడిపి ఒక్కొక్క బొట్టు వడ్డున వదలటం చూచిన నారదుడు పరిహసించి దానితోయిలా అంటారు "నీ ఆయుష్షు ఎంత, సముద్రం నీటిని అంతా తోడగలవా? అనగా" ఫలితం పట్లనాకు దృష్టిలేదు నాకృషినాది తరువాత పరమాత్మ దయ" అన్న పిచ్చుక మాటకు, ఆ వజ్రసంకల్పానికి సంతసించిన నారదుడు గరుత్మంతునితో "నీ జాతి పక్షి గుడ్డుకోసం శ్రమపడుతున్నది వెళ్ళి సాయం చెయ్యమనగా ఆయన వెళ్ళి తన రెక్కలను గట్టిగా ఆడించగా సముద్రం దూరమైనది, గుడ్డు లభ్యమైనది". అలాగే మన ప్రయత్నములో నిజాయితీ ఉంటే అది నిజమైతే, స్వప్రయత్నము-ఈశ్వరానుగ్రహము, కాలపరిపక్వానికి సాధ్యంకానిది ఏదీ ఉండదు. తనమీద తనకు విశ్వాసంలేనివాడు పనిని, నిజాయితీగా చెయ్యలేడు. మీరా పరిభాషలో చెప్పాలంటే "నువ్వు అన్నా ఉండాలి, నేను అన్నా ఉండాలి. నువ్వు ఉంటే నేను లేను, నేను ఉంటే నీవు ఉండవు" అనే పట్టుదల కావాలి. పని బరువు కాదు ఫలితం పట్ల ఎదురుచూపులే బరువు ఆత్మమీద ఎంతో ప్రీతి ఉంటే మన సాధన మీద కూడా అంత ప్రీతి ఉండాలి. మన సంస్కారాలచేతుల్లో వెయ్యిసార్లు ఓడిపోయినా తిరిగి ప్రయత్నం చెయ్యాలి. పోరాట పటిమను వదలకూడదు. ఆస్థితిలో మనం చేతులు ఊపటమే మన పని తరువాత పని గురువే చేస్తారు. అనేక అపజయాల తరువాత వచ్చే విజయమే ఆనంద ప్రదము. ఆ సమయంకోసం సద్గురువు మనకు ఈ స్వేచ్ఛనిస్తారు. దాన్ని సద్వినియోగం చేసుకొంటే స్వేచ్ఛా మండలంలో ప్రవేశిస్తాము. శాస్వత శాంతికి వారసులమవుతాము.

**సాగిరాజు రామకృష్ణంరాజు**

అర్థవరం

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-03-2002, హైదరాబాదు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

సర్వకాల సర్వావస్థలలో మన బుద్ధి నిర్మలంగా, నిశ్చలంగా ఉండేటట్లు చూసుకోవాలి. మన బుద్ధిని పాడుచేసుకోకూడదు. మన శరీరఆరోగ్యాన్ని ఎలా కాపాడుకొంటున్నామో అలాగ బుద్ధి నిర్మలంగా, నిశ్చలంగా ఉండేటట్లు జాగ్రత్తగా చూసుకోవాలి. ఆత్మజ్ఞాన సముపార్జనకు ధనంగాని, గౌరవంగాని, మనం చదువుకొన్న చదువు కాని ఏమీ సహకారం చేయవు. మన బుద్ది నిర్మలంగా ఉంటే, నిశ్చలంగా ఉంటే, మనకు శాంతచిత్తం ఉంటే ఇవి ఆత్మజ్ఞాన సముపార్జనకు సహకరిస్తాయి. మనకు నిర్మలమైన బుద్ది, శాంతచిత్తం లేకపోతే కంగారు పడకూడదు. నెమ్మదిగా ప్రయత్నంచేసి వాటిని సంపాదించుకోవాలి. ఇప్పుడు మనం ప్రయాణంలో ఉన్నాము, ఇంకా మన ప్రయాణం పూర్తికాలేదు. ఈ భూమి మీదకు మనం ట్రైనింగు అవ్వటం కోసం వచ్చాము. పరిస్థితులు ఎలా ఉన్నా మనం ఉద్రేకపడకూడదు. మనం ప్రయాణించే మార్గం ఇతరులకు నచ్చకపోతే మనలను విమర్శిస్తారు. ఎవరో విమర్శించారని మనం ఉద్రేకపడితే మోక్షమార్గాన్ని తప్పిపోతాము. అందువలన ఎట్టిపరిస్థితులలోను ఉద్రేకపడవద్దు. సాధన సరిగా చేయలేకపోతున్నాము అని ఎప్పుడైనా ఉద్రేకం రావచ్చు దానిని పోజిటివ్ ఎమోషన్ అంటారు. పోజిటివ్ ఎమోషన్ వలన ప్రమాదం లేదు గాని నెగిటివ్ ఎమోషన్ వలన చాలా ప్రమాదం ఉంది. సబ్జక్టు సరిగా అర్థం అవ్వటంలేదని ఎవరైనా అడిగితే వారికి అర్థమయ్యేలా చెప్పాలి. అప్పుడు ఈశ్వరుడు మిమ్మల్ని ఆశీర్వదిస్తాడు. ఆయన అనుగ్రహాన్ని మీకు ఇస్తాడు. ఎవరైనా పొరపాటు మార్గంలో ఉంటే వారిని సవరించటానికి మీరు ప్రయత్నం చేయవచ్చు. వారిని సరియైన మార్గంలోనికి తీసుకొని రావాలి అని మనం అనుకొంటే వారిని తీసుకొని రాలేము. వారి మీద మనకు ఆప్యాయత ఉండాలి. వారు బాగుపడాలి అనే కాంక్ష మనకు ఉండాలి, మనలను మనం ఎలా ప్రేమించుకొంటున్నామో అలాగ వారిని కూడా ప్రేమించే శక్తి మనకు ఉండాలి.

మనస్సును నియమించుకోవాలి, మనస్సును నిగ్రహించుకోవాలి అని శాస్త్రాలు చెపుతున్నాయి. ఉద్రేకంగా ఉన్నప్పుడు మనస్సు నిన్ను సరియైన మార్గంలో నడపదు, మనస్సుకు



1A

నిగ్రహం కలిగినప్పుడు నిన్ను సరియైన మార్గంలో నడుపుతుంది. అనుకూలపరిస్థితులు ఉన్నప్పుడు మనం బాగానే ఉంటాము, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడు కూడా మనం ఓర్పును విడిచిపెట్టకూడదు, మనోనిగ్రహం కలిగి ఉండాలి. అది ఆధ్యాత్మిక జీవితానికి పునాది వంటిది. అధ్యయనం వలన, పాండిత్యం వలన, రచనల వలన, ఉపన్యాసాల వలన ఇది వచ్చేదికాదు, మనస్సు పల్చబడాలి, దేహము నేను అనే తలంపు పల్చబడాలి. మనం చేసే పనివలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవ్వాలి. మనం చేసే పని పక్షపాతం లేకుండా చేస్తే రాగద్వేషములు లేకుండా చేస్తే దాని వలన మనకు చిత్తశుద్ది కలుగుతుంది, చిత్తశుద్ది మనకు మోక్షాన్ని సంపాదించిపెడుతుంది. మనం ఇతరులకు ఏదైనా చెప్పేటప్పుడు అది వారికి హితకరంగా ఉండాలి, వాళ్ళ బాగుకోరి చెప్పాలి, వారి చైతన్యస్థాయి పెరగటానికి మన మాట సహకరించాలి. మన దేహప్రారబ్దమును బట్టి ఈశ్వరుడు ఏపని అయితే మనకు కేటాయించాడో ఆ పనిని శ్రద్ధగా చేస్తే, కర్మఫలం ఆశించకుండా చేస్తే మనం కర్మలోనుండి విడుదల పొందుతాము. ప్రారబ్దమును అనుభవిస్తున్నాము అని చాలా మంది అంటారు. ప్రారబ్దమును అనుభవిస్తున్నాను అని ఎవడైతే చెపుతున్నాడో వాడిని తీసి ఒక ప్రక్కన పెడితే ప్రారబ్దము మిమ్మల్ని ఏమీ చేయలేదు. సాధన ఎంతవరకు చేయాలి అంటే మనలో ద్వైతబుద్ది నశించేవరకూ సాధన చేయవలసిందే. దేహమునేను అనేతలంపు వేరుతో సహా నశించే వరకూ సాధన చేయవలసిందే. సాధన చేసేటప్పుడు కొన్ని మహిమలు రావచ్చు. నీకు ఆత్మజ్ఞానం కలిగే వరకూ, ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమయ్యేవరకు ఈలోపు మనస్సులో ఎన్ని వికారాలు వచ్చినా, ఉద్రేకాలు వచ్చినా వాటిని ఇముడ్చుకొంటూ ముందుకు వెళ్ళాలి. ఇముడ్చుకొనే శక్తి పెరుగుతూ ఉంటే మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. భగవంతుడు ఏమి చేస్తాడు అంటే కొంతమంది చేత విమర్శింపచేస్తాడు, కొంతమందిచేత స్తోత్రాలు చేయిస్తాడు. ఈ రెండూ సమానంగా తీసుకొంటున్నారా, లేదా అని చూడటం కోసం ఇవి అన్ని చేస్తాడు. పుస్తకాలు చదవటం వలన పాండిత్యం వస్తుంది. కాని మన జీవితంలో అనేక సంఘటనలు జరుగుతాయి. వాటిలో నుండి మనం పాఠాలు నేర్చుకోవలసిఉంది. ఎవరో ఏదో అన్నారని నీ మనస్సును పాడుచేసుకోవద్దు. భేదబుద్ది రవ్వంత కూడా లేకుండా, చింతాకంత కూడా లేకుండా పూర్తిగా నశించేవరకు సాధన చేయవలసిందే. మీ ఇంటి దగ్గర పరిస్థితులు సమాజపరిస్థితులు మీకు ప్రతికూలంగా ఉన్నా మీరు శాంతిగా ఉండగలిగితే అప్పుడు ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతారు. నాకు పాదనమస్కారములు ఎవరూ చేయవద్దు,

సబ్జక్టు ప్రోపర్‌గా అర్ధంచేసుకోండి. అదే నమస్కారం. మనస్సు అణిగిఉండటమే నిజమైన నమస్కారం అని భగవాన్ చెప్పారు. ఎట్టి సంశయము లేనిది చైతన్యం ఒక్కటే. చైతన్యానుభవం మనకు కలిగేవరకూ ఏదో ఒక సంశయము మనకు వస్తూనే ఉంటుంది. మనస్సు అనే గడప దాటితే అక్కడ ద్వితీయం లేదు. ద్వితీయం ఉంటే గౌరవం, అగౌరవం ఉన్నాయి. మీకు గౌరవం వస్తే పొంగిపోతారు అనుకోండి, అగౌరవం వస్తే కృంగిపోతారు అనుకోండి మీకు దేహాభిమానం పెరుగుతుంది, మీ స్వరూపానికి దూరమవుతారు. మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్ధంచేసుకొంటే సింహాసనం మీద కూర్చునట్లు ఉంటుంది. కాలాన్ని పాడుచేసుకోవద్దు, సాధ్యమైనంత వరకు కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. డబ్బు పోతే తిరిగి సంపాదించు కోగలము గాని జరిగిపోయిన కాలం మరలరాదు. అన్నింటికంటే కాలం ఎంతోవిలువైనది ఎందుచేతనంటే భగవంతుడు కాలరూపంలో ఉన్నాడు. స్నేహాలు, విరోధాలు ఇవి ఏమీ నిజంకాదు. ఇవిఅన్ని నీ మనస్సు యొక్క కల్పితమే. వీటితోటి నీ కాలాన్ని పాడుచేసుకోవద్దు. దేహానికి రోగాలు ఎలా వస్తాయో అలాగ మనస్సుకు వికారాలు వస్తాయి. రోగాలు వచ్చే దేహం నీవుకాదు, వికారాలు వచ్చే మనస్సు నీవు కాదు. ఇందులో నుండి బయటకురా. గాఢనిద్రలో నీకు దేహంతోటి, మనస్సుతోటి ఏమీ సంబంధంలేదు. అక్కడ నీవు సుఖంగా, శాంతిగా ఉన్నావు. ఆ స్థితిని జాగ్రదవస్థలో తెచ్చుకోవాలి. దానికి ఎవరో ఇతరులు అడ్డురావటంలేదు, నీ వాసనలు, అలవాట్లు, తలంపులే అడ్డువస్తున్నాయి. ఏ తలంపులయితే అడ్డువస్తున్నాయో వాటిని తొలగించుకోవటానికి నీవు చేసే ప్రయత్నమే సాధన, ఏదైనా పుస్తకం చదివేటప్పుడు చదివిన తరువాత దానిని ఒక ప్రక్కన పెడతాము అలాగే దేహాన్ని కూడా ఎంతవరకు అవసరమో అంతవరకు ఉపయోగించుకోవాలి గాని 24 గంటలు దేహచింతనలో ఉండకూడదు. మనస్సు ఏదో ఒక పనే చేయగలదు. చింతిస్తే దైవాన్ని చింతిస్తుంది, లేకపోతే విషయాలను చింతిస్తుంది. నువ్వు విషయాలను చింతిస్తూ ఉంటే స్వరూపానికి దూరమవుతావు, దైవాన్ని చింతిస్తూ ఉంటే స్వరూపానికి దగ్గరవుతావు. దైవచింతన వలన శాంతి కలుగుతుంది. విషయ చింతన వలన అశాంతి కలుగుతుంది. నీవు ఏది చింతిస్తున్నావో జాగ్రత్తగా చూసుకో.

మనస్సు అణిగినప్పుడు శాంతి వస్తుంది అది నిజం అనుకోవద్దు. అది మరల విజృంభించినప్పుడు అశాంతి వచ్చేస్తుంది. మనస్సు అణగటంకాదు మనస్సు పూర్తిగా నశించేవరకూ దానిని వెంటాడాలి. మనస్సు నశించిన వాడికి అసలు దు:ఖమేలేదు. దు:ఖం





దేహంలో లేదు, మనస్సులో ఉంది. ఈ దేహమే నేను అని మనస్సు అనుకొంటోంది కాబట్టి దు:ఖం యొక్క ప్రభావం శరీరం మీదకు వచ్చేస్తుంది. ఇది ఇలా జరిగింది ఏమిటి? అది అలా జరిగింది ఏమిటి? అనుకొంటూ ఉంటారు. అది అలా జరగవలసి ఉంది కాబట్టి అలా జరిగింది అంతే. దాని నుండి మీరు నేర్చుకోవలసిన పాఠాలు నేర్చుకొంటే మీరు వివేకవంతులు అవుతారు. మనమాటలో చేతలో అహంకారవృత్తి ఉండకూడదు. అసలు గుర్తింపులు కోరుకోకూడదు. గుర్తింపులు కోరుతూ ఉంటే శవబుద్ధి పెరిగిపోతుంది, శివబుద్ధికి దూరమవుతాము. ఉన్నది ఒక్కటే దానికి భిన్నంగా ఏదీ లేదు. ఏదో ఉంది అని అనుకోవటం వలన నీకు భయం వస్తోంది. మీ విరోధులు చేసే విమర్శలకు మీరు కంగారు పడవద్దు, స్నేహితులు చేసే పొగడ్తలకు పొంగిపోవద్దు. ఎందుచేతనంటే విమర్శల వలన నేర్చుకోవలసిన పాఠాలు కొన్ని ఉంటాయి, పొగడ్తల వలన నేర్చుకోవలసిన పాఠాలు కొన్ని ఉంటాయి. అందుచేత వాటిలో నుండి మీరు పాఠాలు నేర్చుకోండి అంతేగాని బాహ్యసంఘటనలకు మీరు ఉద్రేకపడవద్దు. మనం లోకాన్ని జయించాలి, మనస్సును విడిచిపెట్టి లోకం లేదు. మనస్సు అణిగిపోతే లోకం అణిగిపోతుంది, పునర్జన్మలు కూడా అణిగిపోతాయి. మన మనస్సులో భోగకాంక్ష ఉన్నంత కాలం పునర్జన్మ వచ్చి తీరుతుంది. శరీరం లేకుండా భోగం అనుభవించలేము కాబట్టి మనస్సుకు ఇంకో శరీరం వస్తుంది అదే పునర్జన్మ. మీకు దేహాభిమానం ఉన్నంత కాలం ఈ దేహం పోతే కొత్త దేహం వస్తుంది. ఇప్పుడు ఈ దేహం మీద ఎంత అభిమానం ఉందో అప్పుడు కొత్తదేహం మీద కూడా అంతే అభిమానం ఉంటుంది. ఇప్పుడే ఇక్కడే ఈ సమస్యను పరిష్కారం చేసుకోవాలి గాని లేకపోతే దేహాభిమానం ఉన్నంతవరకూ దేహాలు వస్తూనే ఉంటాయి. ఆ దేహమే నేను అనే బుద్ధి కలుగుతూ ఉంటుంది. నీకు చైతన్యబుద్ధి కలిగేవరకూ ఇది నిన్ను విడిచిపెట్టదు. మనిషికి ముందు అహంభావన వస్తుంది. అహంభావన వచ్చిన వెంటనే దేహభావన వస్తుంది. అహంభావన రాకుండా దేహభావన రాదు. అహంభావన వేరుతో సహా నశించేవరకూ దేహభావన నశించదు. హృదయంలో నుండే నేను అనే తలంపువస్తోంది. నేను అనే తలంపు వచ్చాక దేహభావన వస్తోంది. దేహభావన వచ్చాక లోకం వస్తోంది, లోకం వచ్చిన తరువాత దేవతలు వస్తున్నారు. ఇవి అన్నీ అక్కడ నుండే కల్పించబడ్డాయి. ఈ కల్పితం అంతా ఎక్కడ నుండి వస్తోందో అక్కడకు వెళితే గాని అది నశించదు. మీ మనస్సు సహజంగా బాహ్యాముఖానికి వెళుతుంది. దానిని మళ్ళించి దానికి లోచూపు కలుగజేసేవాడే నిజమైనగురువు. మనకు ప్రపంచంలో ఏ విషయం గుర్తుకు వచ్చినా అక్కడ అజ్ఞానం ఉన్నట్లే.

అన్ని తలంపులు అన్ని భావాలు దేహం నేను అనే తలంపును చుట్టుకొని ఉన్నాయి. దేని కారణం వలన ఇవి అన్నీ వస్తున్నాయో అదిపోతే మిగతావి అన్నీ పోతాయి గాని, వీటిని తాత్కాలికంగా పోగొట్టుకొన్నా అది ఉంటే ఇవి అన్నీ మరల వచ్చేస్తాయి. నా శరీరం ముసలిది అయ్యింది, చావుకు దగ్గరగా ఉన్నాను, నాకు భయం వేస్తోంది అని ఒకరు అడుగుతున్నారు. ఎవరికి భయం వేస్తోంది? దేహానికి భయం వేస్తోందా? లేదు. దేహము నేను అనే భావనకు భయం వేస్తోంది. అది నీకు బయట నుండి రావటంలేదు, లోపల నుండే వస్తోంది. అందుచేత నువ్వులోపల వెతకాలి లోపల వెతకాలంటే దానికి తూకం ఉండాలి, వైరాగ్యం ఉండాలి.

దేహం మరణించాక కూడా మనం ఉంటాము, కాని ఉండము అని అనుకొంటాము. దానిలో నుండి భయం పుడుతుంది. ఈ రోజు పగలకు, రేపు పగలకు ఈ రాత్రి ఎటువంటిదో ఈ జన్మకు, రాబోయే జన్మకు మధ్య చావు అటువంటిది అన్నారు భగవాన్. చావు అనేది మనకు స్నేహితుడే కాని మనకు విరోధికాదు. అది మనకు పాత దేహాన్ని తీసివేసి కొత్త దేహాన్ని ఇస్తుంది. మనం ఎక్కువకాలం బ్రతకాలి అని అనుకోకూడదు, తొందరగా చనిపోవాలి అని అనుకోకూడదు. ఇలా అనుకోవటం వలన అహంకారం పెరిగిపోతుంది. నీ తెలివితోగాని, మంచితనంతో గాని, నీకు ఉన్న గౌరవంతో గాని ఇలా నీవు దేనితో తాదాప్యం పొందినా నీ ప్రయాణం ఆగిపోతుంది. నీవు గమ్యానికి చేరలేవు. మీకు ఎన్ని ఉన్నా లోపల అజ్ఞానం ఉన్నంతకాలం దుఃఖం రాకుండా ఎవరూ ఆపలేరు. లోపల చైతన్యానికి సంబంధించిన ఎఱుక, దానికి సంబంధించిన అనుభవం నీకు లేదు. అందువలన భయం వస్తోంది. చైతన్యానుభవం నీకు కలిగినప్పడు ఈ శరీరం ఉందో, లేదో నీకు తెలియదు. శరీరం చనిపోయేటప్పుడు శరీరం పోతోంది అని కూడా నీకు అనిపించదు. అది బ్రాహ్మీస్థితి, దానిని పొందటానికి ప్రయత్నం చెయ్యి, దానిని పొందకుండా నీవు ఎన్ని సాధించినా అవి అన్నీ స్వప్నసమానము. మోక్షం ఎప్పుడు వస్తుంది అని ప్రశ్న. నీవు అసలు పుట్టలేదు అన్న సంగతి నీకు తెలిసినప్పుడు మోక్షం వస్తుంది. నీవు పుట్టాను అనుకొన్నప్పుడు నీకు మోక్షంలేదు. పుట్టింది ఎవరు? దేహం పుట్టింది. దానితో నీకు తాదాప్యం ఉంది. అందుచేత నేను పుట్టాను అంటున్నావు. పుట్టని వస్తువుతో నీకు తాదాప్యం కలిగినప్పుడు ఈ దేహం ఉండటం వలన నీకు లాభం లేదు, అది పోవటం వలన నీకు నష్టంలేదు.

అన్నం లేని వాడికి అన్నం పెట్టటం కంటే, బట్ట లేనివాడికి బట్ట ఇవ్వటంకంటే ఒక



2A

మనిషిలో జ్ఞానం సంపాదించాలనే కాంక్ష కలుగజేయటం అన్ని దానాలకంటే గొప్పదానం అని చెపుతారు. ఆకాంక్ష ఎవరి సమక్షంలో నీకు కలుగుతుందో వారే నీ గురువు. సర్వకాల సర్వావస్థలలో హృదయంలో చైతన్యం ఉంది. నువ్వు చైతన్యంతో కలిసి లేవు, శవంతో కలిసి ఉంటున్నావు. మరణించే ఈ దేహంతో ఇప్పుడు నీకు తాదాప్యం ఎలా ఉందో అలాగే ఈ దేహం మరణించకముందే నీ హృదయంలో ఉన్న మరణంలేని వస్తువుతో తాదాప్యం పొందు. అలా తాదాప్యం పొందటానికే సాధన, దానికే సత్పురుషుల సహవాసం, దానికే గురువు అనుగ్రహం. బయటవస్తువుల వలన గాని, మనుషులవలన గాని, బాహ్య సంఘటనల వలన గాని మీకు ఏ రకమైన సంతోషం వచ్చినా అది అస్వతంత్రమైనది, అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది. ఎక్కడైతే నిజం ఉందో, ఎక్కడైతే చైతన్యం ఉందో అక్కడ నుండి వచ్చే సుఖం, సంతోషం స్వతంత్రమైనవి. నువ్వు ఈ దేహంలో ఉండగానే చైతన్యానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. చైతన్యానుభవం కలిగితే నీవు చావులేని స్థితిని పొందుతావు. గాఢనిద్రలో తలంపులు, సంకల్పాలు లేకుండా ఎలా ఉన్నావో జాగ్రదవస్థలో కూడా అలాగ ఉండటం నేర్చుకో. అలాగ ఉంటే మా పని ఎలాగ అవుతుంది అనుకోవద్దు. నీ కోరికతో, తలంపుతో సంబంధం లేకుండా, మీ ప్రారబ్ధంలో ఉంటే ఆ పని జరిగిపోతుంది. మీ కోరికకు శక్తి లేదు, శక్తి ఈశ్వరుడిది. అన్ని నియమాలలో ఆహారనియమం అత్యంత ముఖ్యమైనది. ఆహారం సరిపడ తీసుకో. ఎక్కువ తింటే నిద్రవస్తుంది, సాధన చెడిపోతుంది. శరీరానికి వచ్చే అనారోగ్యం కంటే మనస్సుకు వచ్చే అనారోగ్యం చాలా ప్రమాదమైనది. శరీరానికి అనారోగ్యం వచ్చినా మనస్సు శాంతిగా ఉంటే శరీరానికి వచ్చిన అనారోగ్యం తొందరగా తగ్గిపోతుంది. శరీరానికి వచ్చిన అనారోగ్యం శరీరం ఉండగా పోకపోయినా స్మశానంతో పోతుంది కాని మానసిక అనారోగ్యం మనకూడా వచ్చేస్తుంది.

నేను సంతోషంగా ఉన్నాను, నేను ఆనందంగా ఉన్నాను అంటారు అంటే అక్కడ కూడా నేను ఉంది. అక్కడ ఆగిపోవద్దు, ఆ నేను పూర్తిగా నశించేవరకూ నీ ప్రయాణం ఆపుచేయవద్దు. ఆ దేహగతమైన నేను పూర్తిగా కాలి బూడిద అయ్యేవరకు నీవు గమ్యస్థానం చేరలేవు. నీ హృదయంలో ఉన్న సత్యం స్వతంత్రమైనది, అది ఎప్పుడూ ఉంటుంది, అది నాశనం లేనిది, అది తానుగా ప్రకాశిస్తూ ఉంటుంది. అది ఉండటం వలననే అది తెలియబడుతూ ఉంటుంది గాని దానికి బాహ్యమైన వెలుతురు అవసరం లేదు. దాని

స్వరూపమే ఆనందం, దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం. నీలోపల ఉన్న వస్తువు అది నీ మాటకు, నీ ఇంద్రియాలకు, నీ మనస్సుకు అందదు. దాని గురించి నాలుగు మాటలు చెప్పండి, నాలుగు మాటలు వ్రాయండి అంటే వ్రాయటానికి వీలులేని దాని గురించి చెప్పటానికి వీలులేని దాని గురించి ఎలా వ్రాయమంటారు? ఏమి చెప్పమంటారు? ఆ వస్తువు గురించి ఊహించటానికి ప్రయత్నం చేయవద్దు, అది ఎలా ఉందో అలా ఉండటానికి ప్రయత్నించు. నీటితో మన శరీరాన్ని ఎలా స్నానం చేయిస్తామో, అలాగ మంచితలంపులు మనస్సును స్నానం చేయిస్తాయి. మనస్సును స్నానం చేయించక పోతే మనస్సులో దురదలు వస్తాయి. మీరు గుర్తింపు కోరుతూఉంటే మీ మనస్సులో దురద ఉన్నట్లు గుర్తు. సత్యాన్ని తెలుసుకోవటానికి మంచి తలంపులు నీకు సహకరిస్తాయి కాబట్టి వాటిని పోషించు. అది గమ్యం అనుకొని అక్కడ ఆగిపోవద్దు, ఆగిపోతే ప్రమాదంలో పడతావు. జపం, ధ్యానం చేసేటప్పుడు చిన్నచిన్న సంతోషాలు వస్తాయి వాటినే ఇముడ్చుకోలేనప్పుడు ఆత్మానందాన్ని ఎలా ఇముడ్చుకోగలరు. చిన్న చిన్న సంతోషాలతో తృప్తి అయిపోతే మన సహస్రారం శుద్ధిఅవ్వదు, సహస్రారం శుద్ధి అవ్వకుండా మనకు ఆత్మజ్ఞానం కలుగదు. మీరు దేనిని పొందాలో ఆ వస్తువును మిస్ అవ్వవద్దు. ఈ చమత్కారాలను, భోగాలను చూసి అసలు వస్తువును మర్చిపోవద్దు. జరిగేది అంతా ఈశ్వరసంకల్పం, అనుకొనేది మన సంకల్పం. ఈశ్వర సంకల్పానికి భిన్నంగా ప్రవర్తించగలము అనుకోవటంలో నుండే దుఃఖం అంతా ప్రారంభమవుతుంది. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని పొందవలసిన వస్తువును పొందండి. సాధన సరిగా జరగటం లేదు అని కంగారు పడవద్దు, కాలాన్ని సద్వినియోగం చేసుకోండి. ఏదైతే ఉందో, ఏదైతే శాంతిని కలుగజేస్తుందో, మీరు ఏదిగా ఉన్నారో దానిని పొందటానికి ప్రయత్నం చేయండి. స్వతంత్ర్యమైన సుఖం మీకు అనుభవంలోనికి వచ్చే వరకు మీ ప్రయాణం ఆపుచేయవద్దు. మీ మనస్సు పల్చబడే కొలది, మనస్సుకు లోచూపు వచ్చే కొలది, మనస్సు శుద్ధి అయ్యే కొలది లోపల ఉన్న వస్తువు యొక్క కాంతి మీకు తెలుస్తూ ఉంటుంది, దాని తాలుక సుఖం, శాంతి మీకు అందుతూ ఉంటాయి.



3

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 23-06-2002, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మీరు చిన్నతనంలోనే ఇల్లు విడిచి ఎందుకు పారిపోయారు అని అడిగితే అది నా ప్రారబ్దం అన్నారు భగవాన్. భగవంతుడు ఒక్కడే స్వతంత్రుడు. జీవులు ఎవరూ స్వతంత్రులు కారు. భగవంతుడు అంతర్యామిగా ఉండి వారి ప్రారబ్ధంననుసరించి ఈ జీవులను త్రిప్పుతున్నాడు. అది వీడికి తెలియక నేను స్వతంత్రంగా జీవిస్తున్నాను అనుకొంటాడు. అసలు ఉన్నది భగవంతుడే. ఆడించేది ఆయనే. ఆయన అనుగ్రహం లేకుండా మనం ఆయనను పొందలేము. మనం అహంకారం పెట్టుకోవటం వలన ఆయన మనకు తెలియటం లేదు. సాధన చెయ్యమని పెద్దలు చెపుతున్నారు, శాస్త్రాలు చెపుతున్నాయి. సాధన దేనితో చేస్తాము మనస్సుతో చేస్తాము. సాధన అంటే గుంజీలు తియ్యటం, పరుగులు పెట్టటంకాదు. దాని వలన దేహానికి ఆరోగ్యం వస్తుంది. మనస్సుతో సాధన చేసి మనస్సును అతిక్రమించాలి, మనస్సును తొలగించాలి అది సాధన లక్ష్యం. మనస్సులో నుండి బయట పడితే మనం అజ్ఞానంలో నుండి బయటకు వస్తాము. అప్పుడు ఇంక పరిమితులు ఉండవు, మనకు పూర్ణస్థితి కలుగుతుంది. పూర్ణస్థితి ఎప్పుడయితే కలిగిందో అది మన కడసారి జన్మ. మనం కష్టపడి సత్వగుణం సంపాదించుకోవాలి. సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయటం వలన రూపబుద్ధి, నామబుద్ధి తగ్గిపోతుంది. సత్వగుణం పెరుగుతూ ఉంటే మనం శరీరంలో ఉన్నా లేనట్లు అనిపిస్తుంది, లోకంలో ఉన్నా లోకంలో లేనట్లు అనిపిస్తుంది సత్వగుణంలో అంత గొప్పతనం ఉంది. సత్వగుణంలోనే ఇంత గొప్పతనం ఉంటే సత్వగుణాన్ని ప్రాక్టీసు చేయటం ద్వారా ఏ వస్తువును చేరుకొంటున్నామో ఆ వస్తువు యొక్క వైభవాన్ని మనం నోటితో చెప్పలేము. సాధన ద్వారా సత్వగుణాన్ని పెంచుకొని ముందు మనస్సులో నుండి బయట పడాలి. సత్వగుణం గమ్యం కాదు కాని అహంకారంలోనుండి బయటపడటానికి దారి చూపించి అది ప్రక్కకు తప్పుకొంటుంది. తమోగుణం రజోగుణం తగ్గించుకోవాలంటే అవి తగ్గవు, జాగ్రత్తగా సత్వగుణాన్ని పెంచుకొంటూ ఉంటే అవి తగ్గిపోతాయి. వశిష్ఠుడు రామచంద్రమూర్తికి ఏమి చెప్పాడు అంటే అజాగ్రత్త పనికి రాదు, బహుజాగ్రత్తగా ఉన్నవాడే సత్వగుణాన్ని సంపాదించుకోగలడు. అజాగ్రత్తగా ఉన్నవాడు రజోగుణానికి తొందరగా వశమవుతాడు. రామా! నీవు సజ్జన సాంగత్యం

విడిచిపెట్టవద్దు, సత్వగుణం ఉన్నవారితో సహవాసం విడిచిపెట్టవద్దు. సాత్వికబుద్ధి ఉన్నవారితో సహవాసం చేస్తున్నావు అనుకో నీకు ఎన్ని ఆపదలు వచ్చినా, ఆపదలు అన్నీ కూడా సంపదలు క్రింద మారిపోతాయి అని వశిష్ఠుడు చెప్పాడు. సజ్జన సాంగత్యం వలన మనం కొంచం ప్రయత్నం చేసినా ఆధ్యాత్మికంగా ఎక్కవ లాభం పొందుతాము.

ఈ దేహం భూమిమీదకు ఎందుకు వచ్చిందో ఆ పనులు ఈ దేహం ద్వారా జరుగుతూ ఉంటాయి. ఒకోసారి మీకు ఇష్టంలేని సంఘటనలు జరుగుతూ ఉంటాయి. మీకు ఇష్టం లేని సంఘటనలు జరుగుతున్నాయి అని భగవంతుడికి తెలుసు, అంతటా ఉన్న భగవంతుడికి తెలియకుండా ఎలా ఉంటుంది. మీ మనస్సు బలహీనంగా ఉంటే దానిని బలంగా తయారు చెయ్యటం కోసం, మీకు ఆత్మవిశ్వాసం లేకపోతే ఆత్మవిశ్వాసం కలుగజేయటం కోసం, మీకు దు:ఖం వస్తూ ఉంటే దు:ఖంలేని స్థితికి తీసుకొని వెళ్ళటం కోసం అటువంటి సంఘటనలు భగవంతుడు క్రియేట్ చేస్తూ ఉంటాడు. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి భగవంతుడు ఒకో సంఘటన క్రియేట్ చేస్తాడు. మిమ్మల్ని ఆదర్శమానవుడిగా తీర్చిదిద్దటానికి, మీమీద మీకు నమ్మకం కలుగజేయటానికి, భగవదనుభవం పొందటానికి భగవంతుడు అనేక సంఘటనలు క్రియేట్ చేస్తాడు. ఇది అంతా భగవంతుడే చేస్తున్నాడు అని మీకు తెలియకపోవటం వలన దు:ఖం వస్తోంది, భయం వస్తోంది. ఇది అంతా ఆయనే చేస్తున్నాడు అని మీకు తెలిస్తే ఏమీ లేదు. సన్యాసం అంటే కాషాయగుడ్డలు కట్టుకోవటం సన్యాసం కాదు, కర్మఫలత్యాగి సన్యాసి అని గీతలో భగవంతుడు చెప్పాడు. మన లోపల అజ్ఞానం ఉంటే కోరిక వస్తుంది. కోరిక వచ్చాక కర్మ చేస్తాము, కర్మచేస్తే ఏదో ఫలితం వస్తుంది, ఆ ఫలితాన్ని ఎంజాయ్ చేస్తాము. అలా ఎంజాయ్ చేసే కొలది అజ్ఞానం పెరిగి పోతుంది. నీ కుటుంబపోషణ కోసం ఇతరుల మీద ఆధారపడకుండా, నీ కుటుంబానికి సరిపడ సముపార్జించుకొంటూ మిగతా కాలాన్ని అంతా నన్ను పొందటానికి ఉపయోగించు. నిరంతరం నన్ను స్మరించుకో. నన్ను స్మరించుట వలన నీవు పవిత్రుడవు అవుతావు. నీ లోపల బంగారం ఉంది. నీవు పవిత్రుడవు కాకపోతే నీ లోపల ఉన్న బంగారం నీకు దొరకదు. మనస్సునిండా దోషాలు ఉన్నవాడికి భగవదనుభవం కలుగదు. అందువలన మనస్సులో ఉన్న దోషాల నుండి విడుదలపొందు. నీ మనస్సు పవిత్రంగా ఉండాలి, నీ బుద్ధి నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి. అలా ఉండాలంటే నిరంతరం నన్ను స్మరించుకో. ఎప్పటివరకు స్మరించుకోవాలి అంటే దేహం చనిపోయేవరకు స్మరించుకొంటే సరిపోదు, రాబోయే జన్మలో కూడా స్మరించుకోవాలి. దీనికి ముగింపు లేదా





అంటే ముగింపు ఉంది. నీ లోపల నేను చైతన్యంగా ఉన్నాను, ఆనందంగా ఉన్నాను, ఆ చైతన్యానుభవం నీకు కలిగే వరకూ నన్ను స్మరించుకొంటూ ఉండవలసిందే ఈ జన్మ, రాబోయే జన్మ అని కాదు అని భగవంతుడు చెపుతున్నాడు. నన్ను సన్యసించమంటారా అని అడిగితే సన్యసించటానికి నువ్వు ఎవరు? నీ దేహానికి సన్యసించే యోగం ఉంటే సన్యసిస్తావు, సన్యసించే యోగం లేకపోతే నువ్వు ప్రయత్నం చేసినా సన్యసించలేవు, జ్ఞానం రాకుండా కర్మ వదిలేస్తే సోమరితనం వస్తుంది. లోకవాసన ఉన్నవాడికి మనస్సు లోపలకు వెళ్ళదు. భగవంతుడు ఎలా పనిచేయమని చెప్పాడో అలా చెయ్యాలి. లోకం గురించి నీకు అనవసరం. మనం ఇతరుల మెప్పు కోసం పనిచేస్తే లాభం కంటే నష్టం ఎక్కువవస్తుంది. ఎందుకంటే ఇతరుల మెప్పకోసం పనిచేయటంవలన అజ్ఞానం పెరుగుతుంది, అవిద్య పెరుగుతుంది. మానవ జన్మ రావటం చాలా కష్టం. మానవజన్మలోనే జ్ఞానం సంపాదించాలనే తపన కలుగుతుంది. అందుచేత మానవజన్మను సద్వినియోగం చేసుకోండి. కాలాన్ని పాడుచేసుకోవద్దు. మీ ఇంటికి బంధువులు వస్తే ఇంట్లో ఉన్న రూపాయి కాగితాలు పొయ్యిలో పెట్టి కాఫీ కాసి ఇవ్వటం ఎటువంటిదో మానవజన్మను చిల్లర విషయాలకోసం ఖర్చు చేయటం అటువంటిది. మానవ జన్మ యొక్క విలువ మీకు తెలియటం లేదు. ఈ శరీరం చనిపోయిన తరువాత అయ్యో శరీరం ఉండగా ఏమీ సాధించలేక పోయాము అనుకొంటే మరల ఈ శరీరం రమ్మంటే రాదు. అందుచేత మానవజన్మను వేస్టు చేసుకోవద్దు. నీ శరీరం చనిపోకముందే నీ హృదయంలో ఉన్న బంగారం నీకు దొరికింది అనుకో అప్పుడు ఎటుచూసినా ఆనందమే, సుఖమే, శాంతే. అప్పుడు నీ కళ్ళతో ఏ విషయాలు చూసినా, చెవులతో ఏ విషయాలు విన్నా, నీ కుటుంబ పరిస్థితులు అనుకూలంగా ఉన్నా ప్రతికూలంగా ఉన్నా నీవు అనుభవించే ఆనందం ఇసుమంతయు చెదరదు, అట్టిది ఆత్మానందం. హృదయంలో ఉన్న బంగారం దొరికినవాడు శరీరం ఉండగానే శరీరరహితుడుగా ఉంటాడు.

మనందరము ధర్మాన్ని మర్చిపోయాము. ధర్మాన్ని ఆచరించకుండా జ్ఞానం సంపాదించాలనే కాంక్ష అసలు రానేరాదు. ఈజన్మలో ఎవరికైనా జ్ఞానం సంపాదించాలనే కోరిక కలుగుతూ ఉంటే పూర్వజన్మలో వారు ఎంతోకొంత ధర్మాన్ని ఆచరించారని గుర్తు. సంసారంలో ఉండి సాధన చేస్తే ఆత్మజ్ఞానం కలుగుతుందా అని అడుగుతున్నారు. దీనికి భగవాన్ ఏమి చెప్పారు అంటే సంసారంలో ఉన్నా నీవు ఆత్మవే, సన్యాసం పుచ్చుకొన్నా నీవు ఆత్మవే. నీవు పనిచేసినా, పని చేయకపోయినా ఆత్మవే. దేహాన్ని ప్రారబ్ధానికి వదిలెయ్యి. నీవు

లోపల ఉన్నబంగారాన్ని పట్టుకో. ఈ భూమి మీదకు ఏ పని కోసం వచ్చావో ఆ పని చూసుకో. నా దేహప్రారబ్ధం ఇలాఉంది ఏమిటి అనుకోకుండా ప్రారబ్దాన్ని ఎంజాయ్ చేస్తూ మనస్సులో ఉన్న కల్మషాల నుండి బయట పడటానికి ప్రయత్నం చెయ్యి. అంతేగాని నేను గృహస్థాశ్రమంలో ఉన్నానా, సన్యాసాశ్రమంలో ఉన్నానా అనికాదు. ఏ ఆశ్రమంలో ఉన్నా ఒక్కటే, నువ్వు లోకవాసన లేకుండా ఉంటే సరిపోతుంది. గురువు చెప్పిన మాట మీద నీకు విశ్వాసం ఉండాలి ఎందుచేతనంటే గురువు మన మనస్సును అంతర్ముఖం చేసి, ఆత్మానందం మన చేతికి అందేవరకు ప్రతిజన్మలోను మనకూడా వస్తాడు. ప్రపంచంలో ఎక్కడ చూసినా అజ్ఞానమే కనిపిస్తోంది, దు:ఖమే కనిపిస్తోంది కాని జ్ఞానం కనబడటం లేదు, శాంతి కనబడటంలేదు అని అడుగుతున్నాడు. నువ్వు అడిగిన ప్రశ్నే మాయ. ప్రపంచం గొడవ నీకు ఎందుకు? నీ గొడవ ఏదో నీవు చూసుకో. నిన్ను నీవు సంస్కరించుకో, నీ సాధన ఏదో నీవు చేసుకో. లోకం గొడవ లోకం చూసుకొంటుంది. నీ లోపల అశాంతి ఉంటే లోకం అంతా అశాంతిగా కనబడుతుంది. అసలు లోకం లేదు, చావు పుట్టుకలు లేవు. ఉన్నది ఒక్కటే. అదే బ్రహ్మం, అదే నీకు లోకంగా, నామరూపాలుగా కనబడుతోంది. నీలో ఉన్న అజ్ఞానం వలన ఆత్మే ప్రపంచం క్రింద కనబడుతోంది. అజ్ఞానం పోయింది అనుకో ఆత్మ నీకు వ్యక్తమవుతుంది. మరి సంఘాన్ని బాగుచేయటం ఎలాగ అని అడుగుతున్నాడు. ముందు నీవు బాగుపడు. తరువాత సంఘం గొడవ చూడవచ్చు. అసలు నీకు ఏదైనా ఉంటే సంఘానికి ఇవ్వగలవు. నీలో ఏమీ లేకుండా సంఘానికి ఏమి ఇస్తావు. ఇవి ఆలోచనలేని మాటలు. నువ్వు ఎంతవరకు బాగుపడితే అంతవరకు నిన్ను ఆదర్శంగా పెట్టుకొని సంఘం కూడా బాగుపడుతుంది. ఏ మనిషికి ఆ మనిషి బాగుపడటానికి ప్రయత్నం చేస్తే సంఘం అదే బాగుపడుతుంది. నువ్వు ఇతరుల గొడవలలో ఎక్కువగా కలుగజేసుకొంటే నీకు రజోగుణం పెరుగుతుంది, నీ సాధన ఆగిపోతుంది, ఉన్నది ఊడిపోతుంది. ఇతరుల గొడవలు నీకు వద్దు. భగవంతుడు నీకు ఏ పని ఇచ్చాడో ఆ పనిని శ్రద్దగా, ప్రేమగా చేస్తూ సమానబుద్దిని పెంచుకొంటూ ఉండాలి. రాగద్వేషములు పోతే మనస్సు వెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. సత్పురుషుల సహవాసం వలన, ఈశ్వరుని నిరంతరం స్మరించటం వలన రాగద్వేషములు తగ్గిపోతాయి. ఇంట్లో వారు నీ మాట విన్నా, వినకపోయినా భగవంతుడు నీకు ఇచ్చిన పనిని ప్రేమగా చెయ్యి. ఇంట్లోవారి గొడవ నీకు ఎందుకు? భగవంతుడు నీకు కేటాయించిన పనిని చేస్తూ నిర్మలంగా, నిశ్శబ్దంగా ఈ లోకం విడిచి వెళ్ళిపో, అల్లరి చేయవద్దు. నీకు మార్కులు వేసేవాడు భగవంతుడే





గాని ఇంట్లో వ్యక్తులు కాదు. అంతా భగవంతుడే మోస్తున్నాడు. కాని నేను మోస్తున్నాను అనుకొంటున్నావు అందువలన దు:ఖం వస్తోంది. భరించేది అంతా భగవంతుడే అని నీకు అర్థమయితే నీకు చింత ఉండదు. భగవంతుడు మీద భారం వేస్తే నీకు చింత ఉండదు, భయం ఉండదు.

మనకు ఏ రకమైన కోరిక లేదు అనుకోండి ఈ శరీరాన్ని ఏమి చేసుకొంటాము. మనం శరీరానికి చేసే చాకిరి అంతా, ఇంతా కాదు. దానికి చాకిరి చేయటం ఎలాగ తప్పటం లేదు, దానిని జ్ఞానసముపార్జనకు ఉపయోగించుకో. మనలోపల భగవంతుడు ఉన్నాడో, లేడో మనకు తెలియటంలేదు. దేహం, మనస్సు తెలుస్తున్నాయి. ఈ రెండింటిని భగవదనుభవం పొందటానికి ఉపయోగించుకో. కోరికే కర్మ చేయిస్తుంది. ఆ కర్మే కోరిక లేకుండా చెయ్యి ఇప్పడే, ఇక్కడే మహాజ్ఞానివి అయిపోతావు, నువ్వు నామరూప రహిత స్థితిని పొందుతావు. పని చేయాలని సంకల్పం ఇచ్చేవాడు ఈశ్వరుడే, పని చేసే శక్తిని నీకు ఇచ్చేవాడు ఈశ్వరుడే, పని చేసే వాడు ఈశ్వరుడే ఇంక మీరు ఎక్కడ ఉన్నారు. మీరు లేరు కాని మీరు ఉన్నారు అనుకొంటున్నారు. ఇలా అనుకోవటం వలననే కొంపలు ములుగుతున్నాయి. ఇది తెలుసుకోవటమే జ్ఞానం. అప్పుడు ఇంక నీకు చింతలేదు. వాసనాక్షయం అయ్యేవరకు నీవు జాగ్రత్తగా ఉండవలసిందే. ఏదో చిన్న వాసన ఉన్నా అది నిన్ను మోహపరుస్తుంది. దానివలన నీవు పతనమైపోతావు. అజాగ్రత్తపనికిరాదు. ఈ ప్రపంచం భవిష్యత్‌లో ఎలా ఉంటుంది అని అడుగుతున్నాడు. నీ శరీరం పుట్టకముందు ఈ ప్రపంచం ఉంది, శరీరం ఉన్నప్పుడు ఈ ప్రపంచం ఉంది, ఈ శరీరం చనిపోయాక కూడా ప్రపంచం ఉంటుంది. నీ శరీరం పుట్టక ముందు ఈ ప్రపంచాన్ని ఎవడు చూసాడో నీ శరీరం చనిపోయాక కూడా వాడే ఈ ప్రపంచాన్ని చూసుకొంటాడు. ఈ ప్రపంచం గొడవ నీకు వద్దు. ఈ ప్రపంచం ఎవడిదో వాడే దాని భారాన్ని మోస్తున్నాడు. నీ భారాన్ని కూడా ఆయనే మోస్తున్నాడు. నువ్వు మోస్తున్నాను అనుకోవటం వలన చింతవస్తోంది. లోకవాసన నీకు ఎక్కువ ఉన్నప్పుడు జ్ఞానం సంపాదించాలనే కాంక్ష నీకు రాదు. నీకు లోకదృష్టి తగ్గితే గాని జ్ఞానదృష్టిరాదు. మన ఆలోచనలో దోషం ఉండకూడదు, చెడు సహవాసాలు ఉండకూడదు. చెడుసహవాసాల వలన మనం చెడిపోతాము. వారు మనకు ప్రేమను నేర్పరు, అసూయను నేర్పుతారు. జ్ఞానికి ఎందుకు వికారం కలుగదు అంటే ఆయన మన నామరూపాలను చూడడు. మనలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడినే చూస్తూ ఉంటాడు. అలాగ చూడగలిగినవాడు

నిజమైనచూపులు కలవాడు.  నీకు ధైర్యం లేదు అనుకో, ఓర్పు లేదు అనుకో నీకు లోచూపు కలుగదు.  జ్ఞాననిష్ట కలుగదు, సత్యసాక్షాత్కారం కలుగదు.  ధైర్యం, ఓర్పు నీకు లేదు అనుకో ఈ రెండూ నేర్చుకోవాలి.  నువ్వు కాని దానితో దేనితోను తాదాప్యం పొందవద్దు.  నీవు అలాగ అనుకోవద్దు ఇలాగ అనుకోవద్దు.  అనుకోవటం మానివెయ్యి.  అనుకోవటం మానివేస్తే నీవు నీవుగా ఉంటావు.  అప్పుడు నీలోపలఉన్న వస్తువు నీకు స్ఫురిస్తుంది.  ఆచార్యుల వారు ఒకచోట మాట్లాడుతూఉంటే ఒకరు లేచి మీరు చెప్పింది చాలా బాగుంది అన్నాడు.  అప్పుడు ఆచార్యుల వారు ఏమి చెప్పారు అంటే నేను చెప్పింది మెచ్చుకోవటం కాదు, నేను చెప్పింది విని సంతోషిస్తే సరిపోదు, ధర్మాన్ని ఆచరించు అప్పుడు నేను సంతోషిస్తాను.  ధర్మాన్ని ఆచరించకుండా నేను అది చదివాను. ఇది చదివాను అంటే సరిపోదు.  ధర్మాన్ని ఆచరించటం వలన నీవు బాగుపడతావు.  ధర్మాన్ని ఆచరించటం వలన నీకు జ్ఞాననిష్ట కలుగుతుంది, నీవు జీవన్ముక్తుడవు అవుతావు అని చెప్పారు.  మనం ఏ పని చేస్తున్నా అది కోరికతో చేస్తున్నామా, కోరిక లేకుండా చేస్తున్నామా అనేది చూడాలి.  కోరికతో చేసే పనివలన బంధం కలుగుతుంది,  చీకటిలో పడతాము.  కోరిక లేకుండా చేసే పనివలన చిత్తశుద్ధి కలుగుతుంది, మోక్షం కలుగుతుంది.

రామ రామయని పలుకవె మనసా!
రాముని ప్రేమతో కొలువవె మనసా! ॥రామ రామయని॥

రామనామము ప్రణవము కాదా?
రామరూపము బ్రహ్మము కాదా? ॥రామ రామయని॥

రాముని మంజుల నామ స్మరణము
రాముని మంగళ రూప ధ్యానము
ఎన్నో జన్మల పాపములణచీ
నిన్ను చేర్చదటె అమృత ధామము! ॥రామ రామయని॥

రామరామయను తారక మంత్రము
రామదాసుని క్షేమంబరయదో?
రామరామయను నాదబ్రహ్మము
త్యాగరాజును తరింపజేయదో? ॥రామ రామయని॥

రామనామము అమృతరసమే!
రామనామము ఎంతో సుఖమే!
ఒకపరి నీకా రుచి తెలిసినచో
ఇక మరి వదలవు ఓ నా మనసా! ॥రామ రామయని॥

– Dr. **R.A. నాయక్**



4A

# రమణభాస్కర

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-06-2002, సిద్ధాపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వాసనలయొక్క వేగం ఎక్కువగా ఉన్నప్పడు మన హృదయంలో ప్రకాశిస్తున్న బ్రహ్మమును మనం పొందగలమా, లేదా అని సందేహం వస్తూ ఉంటుంది, భయం కలుగుతూ ఉంటుంది.  మీరు కంగారుపడవద్దు, మీరు అందరూ తరిస్తారు, మీరు అందరూ జ్ఞానానికి వారసులు.  ఈశ్వరుడు అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాడు.  మనస్సుయొక్క చాపల్యం వలన లోపల ఈశ్వరుడులేడు అని మనకు అనిపిస్తుంది.  ఏకచింతన అంటే మీ ఇష్టదేవత ఎవరు అయితే వారిని నిరంతరం స్మరించటంవలన మనస్సుయొక్క చాపల్యం తగ్గుతుంది.  ప్రాణాయామం వలన మనస్సుయొక్క చాపల్యం తగ్గుతుంది.  కొంతమంది శరీరాన్ని ఎక్కువ సుఖపెట్టరు.  శరీరాన్ని సుఖపెట్టకుండా ఉండటం వలన కూడా మనస్సుకు నిగ్రహం వస్తుంది.  మన బుద్ధిచేతిలో మనస్సు ఉంటే మనకు పురోగతి, మన మనస్సు చేతిలో బుద్ధి ఉంటే మనకు తిరోగతి.  మనం అభివృద్ధిలోనికి రావాలంటే బుద్ధిచేతిలో మనస్సు ఉండాలి.  ఇది మంచిది అని మనబుద్ధి చెపుతూ ఉంటుంది గాని మనస్సు వినదు.  బుద్ధి చెప్పినట్లు మనస్సు వింటే మన శరీరానికి ఆరోగ్యం, మనస్సుకు ఆరోగ్యం.  కాని మన మనస్సు చెప్పినట్లు బుద్ధి వింటోంది కాబట్టి మనం పతనమవుతున్నాము.  సత్కర్మ, సజ్జనసాంగత్యం ఇవి రెండూ విడిచిపెట్టకూడదు.  మీకు చేతనైనంతవరకు మంచిపని చేయాలి, పుణ్యకర్మ చేస్తూఉండాలి.  భగవంతుడు మనకు ఇచ్చిన అవకాశములను ఉపయోగించుకొని సత్కర్మ చేయాలి.  మంచిపనిచేయటం వలననే మోక్షంరాదు, మంచి పనిచేయటంవలన మనస్సు యొక్క చాపల్యం తగ్గుతుంది, మనస్సుకు లోచూపు కలుగుతుంది, చిత్తశుద్ధి కలుగుతుంది, ఇది సత్యం, ఇది అసత్యం అని తెలుసుకొనే వివేకం కలుగుతుంది.  సత్కర్మ చేయగాచేయగా జ్ఞానాన్ని సంపాదించాలనే బుద్ధి మనకు కలుగుతుంది, అప్పడు జ్ఞానాన్ని సంపాదించటానికి మనకు అర్హత కలుగుతుంది.  సత్కర్మ చేయగా చేయగా, సజ్జన సాంగత్యం చేయగాచేయగా మనస్సు నెమ్మదిగా కరిగిపోతుంది, అప్పడు నేను అనే తలంపు పూర్తిగా నశిస్తుంది.

మీరు అందరూ శాంతి సామ్రాజ్యానికి అధిపతులు అవ్వాలంటే ఒకటే మందు కర్తమనం కాదు, కర్త ఈశ్వరుడే ఆయన ఆజ్ఞననుసరించి ఇది అంతా నడుస్తోంది అని మనకు దృఢమైన విశ్వాసం ఉండాలి.  ఈశ్వరుడు అంటే నియమించేవాడు, ప్రభువు.  ఏ శక్తి అయితే ఈ

శరీరాన్ని భూమి మీదకు తీసుకొని వచ్చిందో ఆ శక్తి యొక్క ఆజ్ఞ అయిన తరువాతే ఈ శరీరం శవం అవుతుంది. కర్త ఈశ్వరుడే కాని మన దొంగనేనును కర్త అని మనం అనుకొంటున్నాము. ఇక్కడ నుండే అంతా ప్రారంభమవుతోంది. ఈశ్వరుడి యొక్క ఆజ్ఞననుసరించి అంతా జరుగుతోంది. నీ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో తదనుగుణంగా ఆ దేహాన్ని నియమిస్తూ ఉంటాడు. ఈ రహస్యం మనకు తెలియక దుఃఖం వస్తోంది. దుఃఖానికి కారణం బయటలేదు, నీలోపలే ఉంది. కర్త ఈశ్వరుడే అని నీవు నోటితో చెప్పేది లోపల నీకు అనుభవంలోనికి వస్తే ఈ క్షణంలో దుఃఖం అంతా చల్లారిపోతుంది. కోరికే అశాంతికి కారణం. అజ్ఞానం నుండి కోరిక వస్తుంది. కోరికే కోపంక్రింద, మోహంక్రింద, గర్వంక్రింద ఇలా అనేకరకాలుగా మారుతుంది. కోరిక ఉన్నవాడికి స్నేహం, విరోధం. కోరిక లేనివాడికి స్నేహంలేదు, విరోధంలేదు. నువ్వు కోరికతో పూజ, జపం, ధ్యానం చేయవచ్చు. నీ పూజాఫలం, ధ్యానఫలం కోరికకు పరిమితమవుతుంది. అప్పుడు ఫలితం నీకు రావచ్చు కాని దొంగనేను మటుకు నశించదు. మనకు భగవంతుడి మీద ప్రేమ, భక్తి, విశ్వాసం ఉండాలి. మనలో ఉన్న దోషం ఏమిటి అంటే ఈశ్వరుడు ఉన్నాడు అనేటువంటి విశ్వాసం మనకు తగినంతగా లేదు. మనం బయట మనుషులతో పోరాడటం కాదు, మనలో ఉన్న అవిశ్వాసంతో ముందుపోరాడాలి. ఈశ్వరుడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు కలిగితే మన మనస్సువెళ్ళి హృదయగుహలో పడిపోతుంది. ఈశ్వరుడు ఒకడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం ఉన్నవాడు, వాడు దురాచారుడైనా వాడు ముందు బాగుపడుతాడు, వాడి విశ్వాసమే వాడిని బాగుచేస్తుంది, విశ్వాసంకు ఉన్నశక్తి అటువంటిది. మనకు ఉండవలసినంత విశ్వాసం లేదు, మనలో అవిశ్వాసం ఉంటే, అపనమ్మకం ఉంటే దానిని తొలగించుకోవటానికి మనం ప్రయత్నం చేయాలి, అదే సాధన. దుఃఖాన్ని సహించటం నేర్చుకొంటే సత్వగుణం వస్తుంది. సత్వగుణం సంపాదించుకొంటే హృదయంలో ఉన్న సత్యం దగ్గరకు అది దారిచూపిస్తుంది. మీకు సత్యానుభవం కలిగినప్పుడు శరీరంతోటి, మనస్సుతోటి, బుద్ధితోటి, లోకంతోటి తాదాప్యం ఉండదు. సత్యానుభవం ఉన్నవాడికి స్వేచ్ఛకలుగుతుంది, వాడు పునర్జన్మరహితుడు అవుతాడు. కోరికలేని భక్తి వలన అహంభావన నశిస్తుంది. కోరికతో ఉన్న భక్తి వలన కోరిక నెరవేరుతుంది అంటే నీభక్తి కోరికకు పరిమితమవుతుంది. ఈశ్వరుడి పట్ల విశ్వాసం ఉండి, కోరిక లేకపోతే అజ్ఞానం నశిస్తుంది. నిష్కామకర్మవలన, నిష్కామభక్తి వలన మనస్సు నశిస్తుంది. మీరు ఏ పనిచేసినా ఆనందంగా చేయాలి, కుటిలత్వం పనికిరాదు. కష్ట సుఖాలను సహించటంవలన ఆనందంగా ఉండటం సాధ్యమవుతుంది. కర్త ఈశ్వరుడే అని నోటితో చెప్పి లోపల నేనే





కర్తను అనుకొంటూ ఉంటే దుఃఖం మీకూడా వస్తుంది. దేహబుద్ధి తగ్గటానికి మూడు తపస్సులు భగవంతుడు చెప్పాడు. శారీరక తపస్సు, మానసికతపస్సు, వాక్కుతపస్సు వలన దేహగతమైన నేను వేరుతో సహానశిస్తుంది. శరీరాన్ని, మనస్సును, వాక్కును జాగ్రత్తగా ఉపయోగించుకొని బ్రహ్మానుభవం పొందటానికి ప్రయత్నం చెయ్యి. అహంభావన లేకుండా జీవించటమే తపస్సు అని భగవాన్ చెప్పారు.

నిరంతరం ఆత్మచింతనలో, ఆత్మధ్యానలో ఉండేవాడే భక్తుడు. స్వస్వరూపాన్ని అనుసంధానము చేసేవాడే భక్తుడు. నీవు ఏ మార్గాన్ని అవలంభించినా అందులో నిండుమనస్సుతో, హృదయపూర్వకంగా చెయ్యాలి. శరీరానికి కష్టం కలుగుతోందని ప్రయత్నం మానవద్దు. ఒకోసారి నీ మనస్సును తలుపుసందున పెట్టి నొక్కినట్లు నొక్కుతాడు. ఆ బాధకు నీవు తట్టుకోగలిగితే అప్పుడు ఈశ్వరుడు నీ శిరస్సు మీద తన అనుగ్రహాన్ని వర్షింపజేసి నీకు అన్నీ ఇస్తాడు, మోక్షాన్ని కూడా ఇస్తాడు. ధర్మాన్ని ఆచరించేవాడికి అన్నీ వస్తాయి, మోక్షం కూడా వస్తుంది. పునాది లేకుండా పై అంతస్థు వేయాలనుకోవటం ఎటువంటిదో, ధర్మాన్ని ఆచరించకుండా మోక్షం పొందాలనుకోవటం అటువంటిదే. దైనందిన జీవితంలో నీ ప్రవర్తన ఎలాగ ఉండాలంటే దేహమునేను అనే బుద్ధి నశించటానికి అనుగుణంగా నీ ప్రవర్తన ఉండాలి. నీవు ఒక మాట మాట్లాడితే, ఒక పనిచేస్తే దేహగతమైన నేను నశించటానికి అవి సహకరించాలి. ఆ రకంగా నీవు జీవించటం నేర్చుకోవాలి. సత్వగుణాన్ని సంపాదించుకొంటే నీవు ఆ రకంగా జీవించగలవు. అధ్యయనంవలన, పారాయణవలన హృదయం యొక్క లోతులు పెరగవు, సహనం వలన హృదయం యొక్క లోతులు పెరుగుతాయి. నేను పనిచేస్తున్నాను. ఇది ఎవరూ గుర్తించటంలేదు, సంతోషించటం లేదు అందువలన పని మానివేద్దాము అని కొందరు అనుకొంటూ ఉంటారు. నీవు అలా అనుకోవద్దు. నీవు చేసేపని హృదయపూర్వకంగా, ప్రేమగా, భక్తిగా చెయ్యి. నీవు చేసేపనిని భగవంతుడు చూస్తున్నాడు. ఇలా పనిచేయటంవలన భగవంతుడు సంతోషించి నిన్ను జ్ఞానంతో అలంకరిస్తాడు. నీవు పని వదిలేస్తే రాబోయే జన్మలో ఆ పనినే నీచేత చేయిస్తాడు.

మీకు తెలివితేటలు లేవు అంటే మీకు కోపం వస్తుంది అంటే అక్కడ బుద్ధితో తాదాప్యం, మీరు మంచివారుకాదు అంటే మీకు కోపం వస్తుంది అంటే అక్కడ మనస్సుతో తాదాప్యం, మీరు ఏమీ బాగాలేరు అంటే మీకు కోపం వస్తుంది అంటే అక్కడ శరీరంతో తాదాప్యం. బుద్ధితో తాదాప్యం ఎంత ప్రమాదమో, మనస్సుతో తాదాప్యం అంతే ప్రమాదం, శరీరంతో తాదాప్యం కూడా అంతే ప్రమాదం. శరీరము, మనస్సు, బుద్ధి ఈ మూడూ ఆత్మకాదు. ఈ

మూడింటితోటి తాదాప్యం వదిలెయ్యి, ఇప్పుడే ఇక్కడే నీకు ఆత్మానుభవం కలుగుతుంది. అదే నీ కడసారి జన్మ. మన దేహము ప్రారబ్దము అనుభవించటానికి వచ్చింది. పాయసం నోటిలో పోసుకొంటే ఎలా ఉంటుందో అలాగ ప్రారబ్దమును అనుభవిస్తున్నారు అనుకోండి అప్పుడు మీకు తెలియకుండానే మీ హృదయం ఖాళీ అయిపోతుంది. ఎప్పుడైతే మీ హృదయం ఖాళీ అయ్యిందో అప్పుడు భగవంతుడు జ్ఞానంతో, శాంతితో, ఆనందంతో మీ హృదయాన్ని నింపుతాడు. మనం హృదయాన్ని ఖాళీ చెయ్యకుండా జ్ఞానాన్ని పొయ్యి, శాంతిని పొయ్యి అంటే అక్కడ ఖాళీ ఉంటేకదా పోసేది. మనలో ఉన్న పెద్దలోపం ఏమిటి అంటే మనం ఆలోచించటం మానివేసాము. అసలు ఎందుకు బ్రతుకుతున్నామో మనకే తెలియటంలేదు, ఎక్కడకు వెళుతున్నామో మనకే తెలియటంలేదు. మనం ఈశ్వరుడికోసం బ్రతికితే ఆనందం, శాంతి కలుగుతుంది, కాని మనం అహంకారం కోసం బ్రతుకుతున్నాము అందువలన చివరకు మనకు దుఃఖం, అశాంతి, చనిపోయినతరువాత చీకటి లోకాలు మిగులుతాయి. ఒక్క రాత్రి కరెంటు లేకపోతే ఉండలేకపోతున్నాము మరి వేలాది సంవత్సరాలు కటికచీకటిలో ఉండవలసి వస్తుంది, అది మర్చిపోకండి. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు, ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూలేదు. ఇది మీకు అర్థం అయినా, అర్థం కాకపోయినా ఇది నిశ్చయం. ఇది తెలుసుకొంటే సుఖపడతావు, తెలుసుకోకపోతే ఏ జన్మకు ఆజన్మ శరీరం కూడా నీడవచ్చినట్లు నీకూడా దుఃఖం వెంటాడుతూ ఉంటుంది, కోటి జన్మలు ఎత్తినా దుఃఖం నిన్ను విడిచిపెట్టదు.

మావి ప్రాపంచిక జీవితాలు, ప్రతీదీ భగవంతుడి సంకల్పం అని జీవించలేము, ఈశ్వర సంకల్పం మీద భారం వెయ్యలేకపోతున్నాము, ఈశ్వర సంకల్పాన్ని అంగీకరించలేకపోతున్నాము. మేము అంగీకరించకపోయినా అదే జరుగుతుంది అయినా అంగీకరించలేకపోతున్నాము అంటున్నారు. ఇలా అంగీకరించకపోవటంలోనే దుఃఖం ప్రారంభమవుతుంది. భగవంతుడి సంకల్పానికి అనుగుణంగా జీవించటం నేర్చుకో. నీ కోరిక నెరవేరినా, నెరవేరకపోయినా, ఆయన దర్శనం ఇచ్చినా ఇవ్వకపోయినా, ఆయన అస్థిత్వం మీద నువ్వు సందేహపడవద్దు, అవిశ్వాసం రానీయవద్దు, విశ్వాసహీనులు అవ్వవద్దు. ఆయన ఏమి చేస్తాడో వేచి చూడు. నీ జీవితాన్ని ఎందుకు ఇలా మలుపుతిప్పుతున్నాడో ఏదో సత్ఫలితం వస్తుంది వేచి ఉండు, తొందరపడవద్దు. ఆందోళన పడవద్దు. నువ్వు చెప్పినట్లు ఈశ్వరుడు నడుచుకోవాలి అని అనుకోవద్దు, ఆయన చెప్పినట్లు నువ్వు నడుచుకోవటం నేర్చుకో నీకు మోక్షం కలుగుతుంది. మనం పూజలు, జపాలు చేస్తున్నాము కాని లోపం ఎక్కడ ఉంది అంటే మనం చెప్పినట్లు



5A

ఆయన వింటే బాగుండును అనుకొంటాము, దీనివలన అహంభావన పెరుగుతుంది. నీకేది మంచిదో నీ కంటే భగవంతుడికే ఎక్కువ తెలుసు. అందువలన ఆయన చెప్పినట్లు నీవు నడుచుకోవటం నేర్చుకో. ఒక దివ్యత్వం ఉంది. అది మీ జీవితాన్ని ఎప్పుడు, ఎక్కడ, ఎలా మలుపుతిప్పాలో తిప్పుతూ ఉంటుంది. మన మంచికోసమే ఆ మలుపులన్నీ వస్తున్నాయి అని అర్థం చేసుకొన్నవారు అదృష్టవంతులు, ధన్యులు.

రాగద్వేషములు లేకుండా ఉండమంటున్నారు ఎలాగ ఉండాలి అని అడుగుతున్నారు. నిరంతరం భగవంతుని స్మరించటం వలన రాగద్వేషములు పోతాయి, పుణ్యకర్మలు చేయటంవలన కూడా ఇష్టము, అయిష్టంపోతాయి. రాగద్వేషములు లేనివారితో సహవాసం వలన కూడా అవిపోతాయి. సత్పురుషులతోటి, మహాత్ములతోటి సహవాసం చెయ్యాలి. మన బుద్ధిలో ఉన్న దోషాలు మనలను మహాత్ములతోటి సహవాసం చేయనివ్వవు. మహాపురుషుల సాంగత్యం నీకు దొరికినప్పుడు ఇష్టాయిష్టాలు వాటి అంతట అవే రాలిపోతాయి నువ్వు వాటిని ఊడగొట్టుకోలేవు. నీలో ఎన్ని వికారాలు ఉన్నప్పటికి నారాయణ స్మరణలో ఆవికారాలు అన్నీ పోతాయి. నీవు తొలగించుకోలేని వికారాలు ఎన్నిఉన్నాకూడా నారాయణ స్మరణలో అవి అన్నీ కాలిబూడిద అవుతాయి. కర్త ఈశ్వరుడే కాని కర్త మనమే అనుకొంటున్నాము, దుఃఖం యొక్క బీజం ఇక్కడే ఉంది. మీరు 90 శాస్త్రాలు చదవనక్కరలేదు, ఈ వాక్యం బాగా అర్థం చేసుకోవటానికి ప్రయత్నం చేయండి. ఈ వాక్యం అర్థమయితే నీలో ఎంత దుఃఖం ఉన్నా ఒక్క క్షణంలో చల్లారిపోతుంది.

---

రమణ మహర్షి బోధలను
రమ్యతరం బగురీతి నాంధ్ర మం
దరుదుగ బోధసేయుచు జ
నావళి "నాత్మ" పథానుయాయులన్
ధర నొగి సల్పుచున్; కరుణఁ
దండ్రుల మించిన తండ్రి యౌచు నం
దరకును 'నాన్నగా' రయిన
ధార్మికు 'సద్గురు' బ్రస్తుతించెదన్;

\- అక్కిపెద్ది కుటుంబ రామశాస్త్రి

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

| | | |
|---|---|---|
| 8-7-2002 | సోమవారం | వెంకటపతి రాజుగారి ఇల్లు, **దిండి** చించినాడ బ్రిడ్జి అవతల |
| 14-07-2002 | ఆదివారం | గుమ్మలూరు |

## విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు 105వ జయంతి ఉత్సవములు






పాలకొల్లు క్షత్రియ సంక్షేమపరిషత్ ఆధ్వర్యములో విప్లవవీరుడు శ్రీ అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవములు ది॥ 4-7-2002న అత్యంత వైభవముగా జరిగినవి. ప్రధమంగా శ్రీ అల్లూరి సీతారామరాజు కాంస్య విగ్రహమునకు జాతీయోద్యమ నాయకులు, మాజీ మంత్రివర్యులు శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తిరాజుగారు పూలమాల వేసిరి. సరస్వతి శిశుమందిర్ విద్యార్థులు అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం, దేశభక్తి గేయములు ఆలపించిరి. సభాప్రారంభంలో సద్గురు శ్రీ నాన్నగారు జ్యోతి ప్రజ్వలన గావించిరి. సభకు సంక్షేమ పరిషత్ ఉపాధ్యక్షులు కె.వి. రామకృష్ణంరాజుగారు అధ్యక్షత వహించిరి. ఈ సభలో జాతీయోద్యమ నాయకుడు చింతలపాటి వరప్రసాద మూర్తిరాజు గారిని, మంతెన సూరపరాజు గారిని ఘనంగా సన్మానించినారు. ఈ సభలో శాసనసభ్యులు శ్రీ అల్లు వెంకట సత్యనారాయణగారు, సన్మాన గ్రహీతలు, మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీ శిడగం పాపారావుగారు, సద్గురు శ్రీ నాన్నగారు, విశాఖపట్నం వాస్తవ్యులు సద్గురు శ్రీ నాన్నగారు చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ శ్రీ పి.యస్.యన్. రాజుగారు, భీమవరం వాస్తవ్యులు రమణమహర్షి హాస్పటల్ నిర్వాహకులు శ్రీ డా॥ డి. విశ్వనాథరాజు గార్లు పాల్గొని తమ అమూల్య సందేశములను ఇచ్చిరి.

పద్మవిభూషణ్ స్వర్గీయ డా॥ బి.వి. రాజుగారు అకాలమరణానికి సంతాపమును తెలియజేస్తూ క్షత్రియ సంక్షేమ పరిషత్ గౌ॥ అధ్యక్షులు శ్రీ చెరుకూరి బుద్ధావతారం రాజుగారు ప్రవేశపెట్టిన సంతాప తీర్మానము, 2 ని॥లు మౌనము పాటించటం జరిగినది.

అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భముగా 6వ తరగతి మొదలు డిగ్రీ వరకు చదువుతున్న 286 మంది విద్యార్థులకు రు. 1,14,000/- స్కాలర్ షిప్‌లు ఇచ్చినారు. ఈ విద్యార్థులకు ఆర్థిక సహాయము అందించుటలో సద్గురు శ్రీ నాన్నగారు, విశాఖపట్నం వాస్తవ్యులు శ్రీ పి.యస్.యన్. రాజుగారు, భీమవరం వాస్తవ్యులు డా॥ విశ్వనాథరాజుగారు భూరి విరాళములు ఇచ్చి క్షత్రియ సంక్షేమ పరిషత్ తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో తోడ్పడినారు.

# చించినాడలో
# బైర్రాజు సత్యనారాయణరాజు ఫౌండేషన్ ఆసుపత్రి ప్రారంభోత్సవము





ది॥ 29-6-2002 చించినాడ గ్రామంలో బైర్రాజు సత్యనారాయణ రాజు ఫౌండేషన్ వారి ఉచిత వైద్య సేవా కేంద్రాన్ని పూజ్యులు సద్గురు శ్రీ నాన్నగారు ప్రారంభోత్సవం చేశారు. స్వర్గీయ బైర్రాజు సత్యనారాయణ రాజు గారి కుటుంబ ప్రతినిధిగా శ్రీ ఇందుకూరి రాజంరాజు గారు (రాజబాబు) ప్రారంభోత్సవ కార్యక్రమమునకు హాజరై ఫౌండేషన్ యొక్క లక్ష్యాలు, గ్రామాభివృద్ధి కార్యక్రమములు, పారిశుద్ధ్యం గురించి వివరించినారు. శ్రీ నాన్నగారు పారిశుద్ధ్యం గురించి మాట్లాడుతూ అనారోగ్యం నుండి ఏ విధంగా రక్షించుకోవాలి, సమాజసేవ దైవ కార్యంగా భావించి ఏవిధంగా ఐకమత్యంగా ఉండాలో, ఇంగ్లాండ్, అమెరికా వంటి దేశాలలో పారిశుద్ధ్యానికి ఏరకమైన ప్రాముఖ్యాన్ని ఇస్తున్నారో తెలియజేశారు. వైద్య సేవాకేంద్రాన్ని రుద్రరాజు రామకృష్ణంరాజు (సోమరాజు) గారి భవనంలో ఏర్పాటు చేసినారు. ఈ కార్యక్రమమునకు డా॥ శ్రీ రామ్మోహన్ రాజు, పాలకొల్లు, గ్రామ సర్పంచ్ శ్రీమతి దానమ్మ, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ చించినాడ పంచాయితీ, గ్రామ పెద్దలు, స్త్రీలు పాల్గొని కార్యక్రమమును విజయవంతం చేసినారు. డా॥ రామ్మోహన రాజుగారు డాక్టరుగా పదవీ భాద్యతలు చేపట్టినారు.